కథ

# సుష్మ... బెటర్‌హాఫ్ అవధాని

- వినూత్న

"వెన్నెల వలస... పేరు బాగుంది. ఆ పేరు వింటుంటేనే కుండపోతగా కురుస్తున్న పున్నమి వెన్నెల్లో తలారా స్నానిస్తున్న ఫీలింగ్.

పేరులాగానే ఊరు కూడా అంతే అందంగా ఉంటుందా.... వెళ్ళి చూస్తేగానీ విషయం తెలీదు...."

వెన్నెలవలస ట్రాన్స్‌ఫరైందని తెలీగానే రాజులో కలిగిన భావ సంచలనం అది.


అయిదు నిముషాల క్రితమే బదిలీ ఉత్తర్వులు అందుకున్నాడతను.


"ఏమోయ్, రాజూ! నిన్నెక్కడికి విసిరేసారు?" అడిగాడు అవధాని పలకరింపుగా నవ్వుతూ.

ఆయన చేతుల్లోనూ బదిలీ ఉత్తర్వులు ఉన్నాయి.

అవధానిని చూడగానే రాజుకి కాబూలీ వాలాయే గుర్తొస్తాడు.

తీసుకున్న అప్పు తీర్చలేని పరిస్థితిలో కాబూలీ కళ్ల పడకుండా ఉంటే చాలని ఓ బడుగు జీవి ఎలా అనుకుంటాడో... సరిగ్గా అవధాని కళ్ల పడకుండా ఉండాలని రాజు కోరుకుంటాడు. అయితే, అది కుదరని పనే.





ఎందుకంటే.... రాజు, అవధాని రెండేళ్లుగా ఒకేకప్పు కింద... ఒకే పాఠశాలలో పనిచేస్తున్నారు.

దాంతో, ఎవరి క్లాసు రూంలో వాళ్లు పాఠాలు చెప్పుకునే సమయాల్లో తప్ప, కారిడార్ లోనో.. స్టాఫ్ రూంలోనో... లాంగ్ బెల్ కొట్టిన తర్వాత హడావుడిగా ఇళ్లకెళ్లే టైంలో స్కూల్లో గేట్ దగ్గర... ప్రతి రోజూ ఒకరికొకరు ఎదురుపడక తప్పేది కాదు.

రాజుకి ఇష్టం లేకున్నా పలకరించక తప్పేది కాదు. అవధాని చిర్నవ్వు విసిరితే గ్రహచారం కొద్దీ... అచ్చం ఆయనలాగే ఆయన రెండో కూతురు సుష్మే రాజు కళ్లకు కనిపించేది. నున్నగా రాగిచెంబులా మెరిసిపోయే బట్టతల మీద అక్కడక్కడా రెండంటే రెండే వెంట్రుకలు గాలికి ఎగిరెగిరి పడుతుంటే అయోమయంగా అతనివేపే చూసేవాడు రాజు.

నుదురంతా పాకే కుంకుమ బొట్టు అవధాని స్పెషాలిటీ.

తెల్ల పంచెకట్టు, లాల్చీ- ఆయన ఆహార్యం.

రాజు కనిపించగానే ఎక్కడలేని అభిమానం కురిపించేస్తూ... అమాంతం ఎగిరి గంతేసి మరీ బిగియారా కావలించుకోవడం ఆయనదైన స్టయిల్.

అష్టావధానంలో అప్రస్తుత ప్రసంగంలా అవధాని చీటికీ మాటికీ తన రెండో కూతురు సుష్మ ప్రస్తావన తీసుకొస్తుంటాడు.

అది రాజుకు అసలు నచ్చదు. కూతురి అందం గురించి తెగపొగుడుతూ... పోటీలో పార్టిసిపేట్ చేస్తే ఈ యేటి మిస్ యూనివర్స్ సుష్మేనని తెగ బిల్డప్ ఇచ్చేస్తుంటాడు. ఆమె ముందు నీలికళ్ల ఐశ్వర్య బచ్చన్, అందాల సుస్మితాసేన్, యుక్తాముఖి, డయానా హెడెన్... లాటి అందెగత్తెలెవరూ సాటి రారని మహా గొప్పలు పోతుంటాడు. అంతేకాదు... పెళ్లి చూపుల పేరుతో ఒక్కసారంటే ఒక్కసారి తన కూతురు సుష్మను చూసేందుకు రావాల్సిందిగా అవధాని రాజుని వత్తిడి చేసేవాడు.

''అంతగా పిలుస్తున్నాడు కదా... పోనీ, పాపం ఓ సారి సుష్మను చూసొద్దామను''కున్న కోరిక రాజులో ఒకవేళ తలెత్తినా... ఆ ఊహని మొగ్గలోనే తుంచేలా తెలివి తక్కువగా అవధాని ప్రవర్తించేవాడు.

అమ్మాయి పోలికలు చెబుతూ, అచ్చం తన పోలికే అనేవాడు. ఆ మాట వినగానే మండుకొచ్చేది రాజుకి. ఎక్కడో కాలేది. చిన్నప్పుడు తిన్న ఉగ్గునుంచీ.. ఎపుడూ తాగని పెగ్గు వరకూ తన్నుకొచ్చేలా వాంతి కాలిగేది. దాంతో, అవధానిని చూసినపుడల్లా ఒక్కసారి కూడా చూడనైనా చూడని ఆయన రెండో కూతురు కనిపించి నవ్వొచ్చేది. అయితే, రాజు వాలకం గమనించని అవధాని తన కూతురుని అదేపనిగా పొగుడుతూ మైమరిచిపోయేవాడు. అంతటితో ఆగకుండా... ఆడపిల్లకు తండ్రి పోలికొస్తే అంతకుమించిన అదృష్టం మరోటి లేదంటూ అడ్డమైన రీజనింగ్స్ ఇచ్చేవాడు. వెంటనే, రాజు ఊహల్లో అవధాని పంచెకట్టు క్షణాల్లో మటుమాయమై చీరకట్టు కనికట్టు చేసేది.

'భామా-సత్యభామ' సినిమాలో కమల్‌లా ఆడవేషంలో కనిపించేవాడు అవధాని. ఆ ఆడ లేడీ అవధానిలో సుష్మను వెదికే ప్రయత్నం చేసేవాడు రాజు. దాంతో, సుష్మ ఆడా మగా కానీ వ్యక్తిలా కనిపించి రాజు ఉత్సాహంపై కడివెడు నీళ్లు గుమ్మరించేది. ఆ చికాకులో... 'తండ్రి పోలికొస్తే అదృష్టమని ఎవడ్రా అన్నది? కాకి రంగు, స్థూలకాయం, లావు నడుం... నడుస్తుంటే, భూమి పాతాళానికి కుంగిపోయేంత బలమైన అడుగులు. ఓహ్... అవధానీ! నీ పోలికతో నీ కూతురు ఇంతకంటే ఇంకేం అందంగా ఉంటుంది?' నుకునేవాడు రాజు.

దాంతో, రాజుకి ఒక్క అవధాని కూతురే కాదు, లోకంలో ఉన్న ఆడాళ్లపైనే మొహం మొత్తేసింది.

'మన్మథుడు' సినిమాలో ఇంటర్వెల్ ముందు హీరో నాగార్జునే మయ్యాడు. అవధాని పుణ్యమాని.. ఇపుడు, 'రాజు హేట్స్ విమెన్'.

''థాంక్ గాడ్... ఈ బదిలీతో ఓ బెడద తీరింది. ఈ కాసేపు అవధానిని భరాయిస్తే చాలు.. ఇక, పర్మనెంట్‌గా చూడక్కర్లేదు...''

మనసులోనే అనుకున్న రాజు పైకి తాను నవ్వుతూ అవధానిని పలకరించాడు.

''ఏం మాస్టారూ... మీకూ బదిలీ శ్రీముఖం అందిందా..., ఎక్కడికేమిటి?''

''జొన్నవలస నాయనా... ఈ వయసులో ఆ పల్లెలో పనిచేయాలని నాకు రాసిపెట్టినట్లుంది. ఆ మేరకు అధికారుల ఆదేశమైంది... బదిలీ అంగీకరించాలో, ఉద్యోగం వదులుకోవాలో... పాలుపోవడం లేదు..'' కించిత్ ఉద్వేగంగా చెబుతున్నాడు అవధాని.

''మాబాగా తిక్క కుదిరింది...'' రాజుకి మనసులోనే సంతోషం వేసింది.

''మరి, నీ సంగతో? ఎక్కడి వేసారేమిటి?''

''వెన్నెలవలస...'' చెప్పాడు రాజు.

''వెన్నెలవలసా...పేరు భేషుగ్గా ఉంది. అలాంటి ఊళ్ళకి ఒంటరిగా వెళ్లడం అంత శ్రేయస్కరం కాదు. జంటగా వెళితే శుభం, శోభనం నాయనా...''

అవధాని కబుర్లు వింటుంటే రాజుకి 'ఆవుకు నాలుగు కాళ్ళు, రెండు కొమ్ములుండును. ఆవు పాలిచ్చును...'' అనే ఆవు వ్యాసం గుర్తొస్తుంటుంది.

అవధానికి ఇద్దరూ ఆడపిల్లలే.

రెండు సంవత్సరాల కిందటే పెద్దకూతురుకి పెళ్లి చేసి ఓ బాధ్యత తీరిందనిపించుకున్నాడు.

ఇక, రెండో కూతురు పెళ్లికి ఎదిగింది. డిగ్రీ రెండో సంవత్సరం చదువుతోంది. సర్వీసులో ఉండగానే... ఆ పిల్ల పెళ్లి కూడా జరిపించేస్తే లోకంలోకి వచ్చిన బాధ్యతలన్నీ తీరిపోతాయనే భావనలో అవధాని ఉన్నాడు.

అదే క్రమంలో సంబంధాల వేటలో కొనసాగిస్తుంటే రాజులో పెళ్లికొడుకు కనిపించాడు. ఇక, అప్పట్నుంచీ అవధాని, రాజుల మధ్య పిల్లీ ఎలకా చెలగాటం ప్రారంభమైంది.

పట్టువదలని విక్రమార్కుడిలా అవధాని రాజు వెంట పడసాగాడు. రాజు ఆయన్నుంచీ తప్పించుకోవాలని తెగతాపత్రయపడుతున్నాడు. అయితే, అవధాని కూతుర్ని చేసుకునేందుకు రాజుకెందుకో మనస్కరించడం లేదు.

అభ్యంతరమల్లా అవధాని బాగా తెలిసినవాడవడమే. సహోద్యోగిగా ఆయన్ని గౌరవిస్తాడు. సంబంధం కలుపుకుంటే... బంధుత్వంతో మరింత మొహమాటపడుతూ లైఫంతా ఏ స్వేచ్ఛ లేకుండా స్లేవ్‌లా బతికేయాలి... అందుకే... అవధానికి అందనంత దూరంగా ట్రాన్స్‌ఫర్ అయినందుకు మనసు

లోనే ఖుషి అవుతున్నాడు రాజు. అయితే, వెన్నెలవలసలో మరో ముప్పు ముంచుకొస్తోందని రాజు అపుడు ఊహించనే లేదు.

పల్లెటూళ్లంటే ఆర్ట్ ఫిల్మ్‌ల్లా ఉంటాయనేవాడు తరచూ తన స్నేహితులతో రాజు.

''బయటనుంచి చూడడానికి ప్రతి పల్లె ఆర్ట్ ఫిల్మ్‌లా అందంగానే ఉంటుందిరా. పిల్లగాలి, పల్లె సౌందర్యం ఒకనాటి అనుభూతే కానీ... పర్మనెంట్ అనుభవం కాదు, కాలేదు...''

–ఇదీ పల్లెలపై రాజు ఒపీనియన్.

''మేథావులం అనిపించుకునేందుకు ఆర్ట్ ఫిల్మ్‌లను మెచ్చుకోవాల్సిందే.. అంతేగానీ, ఎల్లవేళలా ఆర్ట్ ఫిల్మ్‌నే చూస్తామనుకోవడం పొరపాటేగా... ఫుల్ ఎంటర్‌టైన్‌మెంట్ కావాలంటే... కమర్షియల్ ఫిల్మ్‌నే ఆశ్రయించాలి. పల్లె ఆర్ట్స్ ఫిల్మ్‌లాంటిదైతే... పట్టణం పక్కా కమర్షియల్ సినిమా'' అనేవాడు రాజు.

అయితే, వెన్నెలవలస రాజు అభిప్రాయాన్ని పూర్తిగా మార్చేసింది.

మోడల్ విలేజ్ అంటారుగా... సరిగ్గా అలాగే ఉంది వెన్నెలవలస.

సింధూరాన్ని దిద్దుకున్న ఆడపిల్ల జడలోని పాపిడిలా చూడముచ్చటైన ఎర్ర మట్టి దారులు... ఆ దారులకిరుపక్కలా ఎత్తుగా, ఏపుగా పెరిగిన ఆకుపచ్చని చెట్లు, గ్రామంలోకి అడుగుపెట్టగానే సుస్వాగతం చెప్పే చిన్ని కోనేరులో విచ్చుకున్న ఎర్ర తామరలు, ఆ కోనేటి పక్కనే వెలిసిన కోవెల్లో నుంచి వినిపిస్తున్న జయజయధ్వానాలు...

కొత్త ప్రపంచంలోకి వచ్చినట్టయింది రాజుకి.

ఆ ఊళ్లో ఉండేందుకు మేడమీది రెండు గదుల పోర్షన్ అద్దెకు దొరికింది రాజుకి. ఇంటివాళ్లు చాలా మంచివాళ్లు. ఇల్లు చూపిస్తూ... ''ఈ ఇంటికి ఒంటరిగా వచ్చినవాళ్లు జంటలైపోతారు. అద్దె ఇల్లు కాదిది... పెళ్లి మండపం...'' అని సోదాహరణగా గతంలో జరిగిన విషయాలను కలుపుగోలుగా ముచ్చటించారు వాళ్లు.

ఇల్లు బాగా నచ్చింది రాజుకి.

సాయంత్రాల్లో కూర్చుని ఆహ్లాదకరమైన ప్రకృతిని ఆస్వాదించడానికి వీలుగా విశాలమైన మేడ... ఆ మేడపైనుంచి చూస్తుంటే.... అదృశ్య చిత్రకారుడు గీసిన అందమైన వర్ణచిత్రంలా పల్లె సోయగాలు, సొగసులు కనిపిస్తాయి.

వెంటనే అడ్వాన్స్ ఇచ్చాడు రాజు.

అడ్వాన్స్ తీసుకోవడానికి కూడా మొహమాటపడడమే కాదు... ''టీచర్‌గా మీరొచ్చారు. మా పిల్లలకూ మంచి చదువు చెప్పండి. అదే మీరిచ్చే అద్దె....'' అన్నాడు.

వాళ్లని ఒప్పించి అద్దె డబ్బు వాళ్ల చేతిలో పెట్టే సరికి తాతలు దిగొచ్చారు రాజుకి.

ఆ ఇంట్లో దిగిన వారం రోజులకు కాబోలు ఆ సన్నివేశం జరిగింది.

అది రాజు జీవితాన్ని మలుపు తిప్పిన సంఘటన.

ఒకానొక సాయంత్రం వేళ మేడపై పచార్లు చేస్తున్నాడు రాజు.

స్కూల్ నుంచి వచ్చి అరగంటైంది.

కాఫీ, ఫలహారం స్వీకరించి ఊసుపోక మేడపై పచార్లు చేస్తున్నాడు.

అలా తిరుగుతూ తిరుగుతూ ఓసారి అలవోకగా కిందికి చూసాడు రాజు.

కింద పెరట్లో టాపులేని బాత్‌రూం ఉంది.

ఎపుడూ ఆ వేపు అంత దీక్షగా చూడలేదు రాజు.

అలా చూడడం సంస్కారం కాదని చూపు తిప్పేసుకుంటాడు.

అయితే, రాజు చూసినపుడు ఆ బాత్ రూం ఎపుడూ ఖాళీగానే ఉంటోంది.

కానీ, ఆరోజు ఆ బాత్ రూం రాజు చూపుని అయస్కాంతంలా ఆకట్టుకుంది.

అక్కడ కనిపించిన దృశ్యాన్ని చూస్తూ చూపు తిప్పుకోలేక స్థాణుచే అయిపోయాడు రాజు.

అపుడు... ఓ పద్దెనిమిదేళ్ల సౌందర్యం జలకాలాడుతోంది.


చూడచక్కని అందం తలారా స్నానం చేస్తోంది.

నీలికళ్ల మిస్ వరల్డ్ వంటిపై నూలుపోగు లేకుండా అక్కడ నీళ్లు పోసుకుంటోంది.

టాప్‌లెస్ బాత్ రూం అయినా... తననెవరూ గమనించడం లేదని కాబోలు.. కూనిరాగాలు తీస్తూ మరీ స్నానం చేస్తోంది. ఆ దృశ్యం రాజు కళ్ల పడింది.

ఒక్కసారిగా అతడి చెవుల్లోంచి వేడి సెగలు.

శరీరమంతా రక్తం మరుగుతున్న ఫీలింగ్. ఆశ్చర్యంతో కదలక, మెదలక అక్కడే ఉండిపోయాడు రాజు.




అజంతా గుహల్లోనుంచి పారిపోయిన శిల్ప సౌందర్యం అక్కడ ప్రత్యక్షమైనట్లయింది.

వంపువంపులో హంపి శిల్పాలు కొలువుతీర్చుకున్న స్నిగ్ధ సౌందర్యం అక్కడే ఆవిష్కృతమైనట్లనిపించింది.

కళ్లు చెదిరే అందం కనికట్టు చేస్తోంది.

నెత్తిమీంచి జాలువారుతున్న ఒక్కో నీటిచుక్క అలనాటి గంగావతరణ ఘట్టాన్ని గుర్తు చేస్తుండగా... రాజు అలౌకికానందాన్ని కళ్లతోనే జుర్రుకుంటున్నాడు.

చెంబులోంచి జారిపడుతున్న నీరు ఆమె శరీరంలోని అణువణువునూ స్పృశిస్తూ కిందికి జారుతోంది. శిఖరాలు, లోయలను అధిగమిస్తూ గలగలపారే గంగలా ఆమెపై నుంచీ ఆ నీరు ప్రవహిస్తోంది.

గదిలోకి దిగి అన్నాళ్లయినా ఇదివరకు ఆమెనెపుడు రాజు చూడనేలేదు. బహుశా... ఇంటివాళ్ల చుట్టం కాబోలు. అక్కడ అలాగే ఆమెను చూస్తూ నిల్చోడం భావ్యంగా తోచలేదు రాజుకి. అలాగని, ఆ చోటుని విడిచి రాలేకపోతున్నాడు.

ఇంతలో ఆమె ఒక్కసారి పైకి చూసింది.

రాజు కనిపించాడు.

షాక్ తింది.

అప్పటికే ఆమె శరీరంలోని చూడవలసిన భాగాలన్నీ చూసేసాడు రాజు.

ఆమె క్షణాల్లో తేరుకుని లంగా చుట్టుకుని అక్కడ్నుంచీ మాయమైంది.

ఆమె మాయమైనా రాజు కళ్ల ముందు ఆమె అందాలు జాతర చేస్తున్నాయి.

''పుట్టిన తర్వాత ఇన్నాళ్లకి తన రెండు కళ్ళూ అదృష్టం చేసుకున్నాయి... నేత్రోత్సవం ఇపుడేగా జరిగింది...'' అనుకున్నాడు రాజు.

గదిలోకి వెళ్లినా అదే స్నానఘట్టం రాజుని వెన్నాడుతూనే ఉంది.

మనోతెరపై మళ్లీ మళ్లీ అదే షో వేసుకుని చూసుకుంటున్నాడు.

పద్దెనిమిదేళ్ల ప్రాయం జలకాలాడే దృశ్యం అపురూపం, అనుపమానం.

సినిమాల్లో ఈ సీన్లెన్ని చూసినా... చుట్టూ కెమెరాలు కన్నుకొడుతుంటే కృతకంగా ఉన్నట్లనిపిస్తుంది.

అంతేకాదు... ఇంత నగ్నంగా ఏ సినిమా కూడా స్నాన సన్నివేశాలను దృశ్యీకరించదు.

పదేపదే అదే దృశ్యం వెన్నాడుతుంటే, ఆమె తన కళ్లను ఓ మగతలా కమ్మేస్తుంటే.. ఏదో మైకం వచ్చిన వాడిలా మరో ప్రపంచంలో కాసేపు తిరిగాడు రాజు.

ఆ రాత్రికి అతనికి అన్నం సయించలేదు. దాహం వేయలేదు.

ఆకలిదప్పులుండని ఈ అవస్థని ఏమంటారో... విశ్లేషించి తెలుసుకునే పరిస్థితిలో అతను లేడు. ఎప్పటికో ఈ లోకంలోకి పడ్డాక... ఆమెవైపు నుంచీ ఆలోచించాడు రాజు. ఊరూపేరూ తెలీని ఓ అపరిచితుడు మేడమీంచి తన నగ్న శరీరాన్ని సంపూర్ణంగా కళ్లింతలు చేసుకుని చూస్తున్నాడంటే... ఆ స్త్రీ ఏమనుకుంటుంది. ఖచ్చితంగా తనని కనీస సంస్కారం లేని వాడనే అనుకుంటుందిగా.... ఆలోచిస్తున్నాడు.

చేతులు కాలాక ఆకులు పట్టుకున్న వైనంలా

అంతా జరిగిపోయాక... ఇపుడు తీరిగ్గా సిగ్గుపడుతున్నాడు రాజు.

తెల్లవారింది.

ఆమె ఎక్కడ ఎదురుపడుతుందో..? అనే భయపడుతూనే నెమ్మదిగా మేడ దిగాడు రాజు.

'హమ్మయ్యా... ఆమె కనిపించలేదు...'' వడివడిగా స్కూల్‌కి వెళ్లాడు.

నిన్న జరిగిన సంఘటన కారణంగా ముఖాముఖి ఎదురుపడేందుకు జంకడమైతే జంకాడు కానీ, తీరా ఆమె కనిపించకపోయేసరికి... కనిపించలేదనే ఆరాటంతో రాజు హృదయం విలవిల్లాడింది.

మళ్లీ సాయంత్రం ఎపుడవుతుందా....? ఎపుడెప్పుడు ఇంటికి చేరుదామా? అనే సందడిలోనే బరువుగా కాలాన్ని లాగించేసాడు.

స్కూల్లో అన్యమనస్కంగానే పాఠాలు చెప్పాడు. లాంగ్ బెల్ కొట్టారు. స్కూల్ పక్కనే ఉన్న తడిక హోటల్‌లో రవ్వదోసె తిని... వేగంగా ఇంటికి చేరుకున్నాడు.

నిన్నటిలాగే మేడపై పచార్లు చేస్తూ కిందికి దృష్టి సారించి ఒక్కసారి షాక్ తిని వెనుకడుగు వేసాడు.

''ఓయ్... నిన్నే..'' ఓ అరుపు వినిపించింది.

స్పందించకపోతే మరింత గట్టిగా గింతు వేసుకుని ఇల్లంతా హడావుడి చేసేస్తుందేమోనని భయం వేసింది రాజుకి.

నెమ్మదిగా కిందికి చూసాడు రాజు.

ఆ అపరిచిత టాప్‌లెస్ బాత్ రూంలో ఒంటి నిండా బట్టలతో నిలుచుని ఉంది.

భుజంపై టవల్. చేతిలో సోప్.

''ఏంటి సంగతి?'' తలెగరేస్తూ అడిగింది.

''ఏ సంగతి?'' తనకేం తెలీనట్లు, నోట్లో వేలు పెడితే కొరకడం చేతకానంత అమాయకంగా ఫోజిస్తూ అడిగాడు రాజు.

''నీ సంగతే... ఏంటని అడుగుతున్నా...?''

''నా సంగతా? ఏం ఉంటుంది?''

''మేడపై పచార్లూ... స్నానాలు చేస్తున్న ఆడాళ్లను గుడ్లప్పగించి చూడడాలు... ఏంటని అడుగుతున్నా...'' కాస్త గొంతు పెంచి మరీ అడుగుతోంది ఆ అమ్మడు.

''ప్లీజు! గట్టిగా అరవమాకు.. నిన్న అలా అనుకోకుండా జరిగిపోయింది. కావాలని చూళ్లేదు.. గట్టిగా అరచి గోల చేయకు...'' రెండు చేతులెత్తి దండం పెట్టసాగాడు రాజు. కాస్త కోపంగా చూసి ఆమె అక్కడ్నుంచీ చకచకా వెళ్లిపోయింది. ఇక, తన పనైపోయిందని బెంగపడుతున్నాడు రాజు. లోనికి వెళ్లిన ఆమె ఇంటి ఓనరుతో నిన్న జరిగిన సంగతి పూసగుచ్చినట్లు చెబుతుంది. దాంతో, ఆమె కోపంతో చిందులేసుకుంటూ మేడపైకి వస్తుంది. మా ఊరికి టీచరొచ్చాడని, మా ఇంట్లోనే దిగాడని మాగొప్పగా చెప్పుకునే ఆమె... ఇంటద్దె అడ్వాన్స్ కూడా తీసుకునేందుకు మొహమాటపడిన ఆమె... ఇపుడు ఖచ్చితంగా తనని ఈ ఇంట్లోనుంచి గెంటేస్తుంది.

ఇపుడేం చేయాలో తెలీక తికమకపడుతున్నాడు రాజు.

ఇంతలో- సంగీతం సృష్టిస్తూ సన్నగా గాజుల సవ్వడి.

అడుగులు వేస్తుంటే లయబద్ధంగా మోగుతున్న గజ్జెల సందడి.

ఎవరో వచ్చిన అలికిడి.

బయటకొచ్చేందుకు సాహసం చేయలేకపోతున్నాడు రాజు.

''ఓయ్.. బయటకురా...'' ఓ స్త్రీ గొంతు వినిపించింది.

రాజు సంశయిస్తున్నాడు.

''నువ్వే బయటకొస్తావా? నన్నే రమ్మంటావా?'' సవాల్ చేస్తున్నట్లు అందామె.

రాజు బయటకు రాబోతుండగా... ఆమె లోనికొచ్చేసింది.

ఆమె వెనుక ఇంటి ఓనరుందేమోనని ఆత్రుతగా చూసాడు రాజు.

ఎవరూ లేరు. ఊపిరి పీల్చుకున్నాడు రాజు.

''నువ్వు నన్ను అలా చూసావుగా...'' అడిగింది.

'అవున'న్నట్లు తలూపాడు రాజు.

''పూర్తిగా చూసేవుగా...''

మళ్లీ తలూపాడు.

''ఓ స్త్రీని అంత నగ్నంగా ఎవరు చూస్తారు?'' ఆమె ప్రశ్నించింది.

''ఎవరు చూస్తారు?'' తనకు తెలీదన్నట్లు ఎదురు ప్రశ్న వేసాడు రాజు.

''టీచర్‌గా పనిచేస్తున్నావుగా.. ఆ మాత్రం తెలీదా నీకు...''

''తెలీదు...'' అప్పటికి నోరు విప్పాడతడు.

''ఎవరు చూస్తారా..? తాళికట్టిన మొగుడు. శోభనం రోజున పాలగ్లాసుతో గదిలోకి వచ్చిన పెళ్లాన్ని చీర లేకుండా అలా చూస్తాడు.... ఇంత వరకూ నన్నెవరూ అలా నగ్నంగా చూడలేదు. పెళ్లయితే నా మొగుడే అలా నన్ను చూస్తాడనుకున్నాను. ఇంకా నాకు పెళ్లి కాలేదు. అపుడే నువ్వలా చూసేసావు. ఇపుడు పెళ్లయితే ఎలా?''

ఏం మాట్లాడలేదు రాజు.

''నగ్నంగా నువ్వు చూసిన శరీరాన్ని నా మొగుడికి నేను చూపించగలనా? సినిమా చూసినట్లు పూర్తిగా నన్ను చేసేసావే.... ఇపుడు నా బతుకేం కాను..'' ఏడుస్తోందామె.

అయితే, చిత్రంగా ఆమె కళ్లవెంట నీళ్లు రావడం లేదు.

''ఇపుడేం చేద్దామంటావ్?'' అడిగాడు రాజు.

''నన్నలా చూసావుగా.. నచ్చానా?''

ఆమె అలా అడుగుతుంటే.. మళ్లీ టాప్ లెస్ బాత్రూంలో ఆమె నగ్నంగా స్నానం చేస్తున్న దృశ్యమే అతని కళ్లవాకిళ్లలో డాన్స్ కట్టింది.

ఒక్క చూపుతోనే ఆమె తెగ నచ్చేసింది.

ఇపుడామె ఎదురుగానే ఉంది.

మిస్‌వరల్డ్‌ని తలపించే సౌందర్యరాశి.

అందానికే అందం ఆమె.

సౌందర్యానికి అర్థం చెప్పే సౌందర్యం ఆమెది.

నిజానికి, ఇదీ ఓ రకం పెళ్లి చూపులే. ట్రెడిషనల్‌గా జరిగే పెళ్లి చూపుల్లో కూడా అయిదు నిముషాల్లో అమ్మాయిలో ఏం చూస్తారు? బాహాటంగా కనిపించే శారీరక ఆకర్షణే ప్రేమకీ, పెళ్లికీ మొదటి పునాదవుతుంది. మూడు ముళ్లు వేసి ఓ ఇంటికప్పుకిందికి నూరేళ్ల జీవనాన్ని పండించుకునేందుకు వచ్చిన తర్వాత తనే ఒకర్నొకరు అర్థం చేసుకోవడం మొదలుపెడతారు. ప్రపంచంలో అత్యధిక శాతం జీవితాల్లో జరిగేది అదే. అంతకుమించి మరోలా జరగదు.

ఆమె అలా నిల్చునే ఉంది.

రాజు ఆమెని దీక్షగా చూస్తున్నాడు.

ఆమె అతడిని పరీక్షగా చూస్తోంది.

''ఫర్వాలేదు. నువ్వు నాకు నచ్చావ్...'' అందామె.


''నాకూనూ..'' అన్నాడు రాజు.

ముగింపు:

ఆ తర్వాత-

దగ్గరలో ఉన్న ముహూర్తానికే వాళ్లిద్దరూ తాళిబంధంతో ఒకటయ్యారు. అయితే, తండ్రి ఆకారాన్ని చూసి తనయను అంచనా వేయడం తప్పన్న సంగతి పెళ్లికి ముందే రాజుకు అవగతమైంది. ఎందుకంటే, రాజు తాళికట్టి భార్యగా తెచ్చుకున్నదెవర్నో కాదు, సుష్మని. సుష్మ అంటే... అవధాని కూతురు.

*



## ఎంత పెద్ద ముద్దో!

లిప్ టు లిప్ కిస్‌లు బాలీవుడ్‌లో కొత్తేమీ కాదు. ఐష్, హృతిక్, విద్యాబాలన్, మాధవన్, మాధురీ దీక్షిత్, వినోద్ ఖన్నా, మనీషాకోయిరాలా, అనిల్ కపూర్ ఇలా చెప్పుకుంటూ పోతే చాలా జంటలు లిప్ టు లిప్ కిస్‌లలో సంచలనాన్ని సృష్టించిన వారే! వారందరి రికార్డులను బద్దలు కొట్టింది సైఫ్ అలీ ఖాన్, కరీనా కపూర్ జంట. 'కుర్బాన్' చిత్రంలో వీరిద్దరూ జంటగా నటిస్తున్న సంగతి తెలిసిందే! ఈ చిత్రం కోసం దర్శకుడు రెన్సిల్ డి సిల్వ వీరిద్దరి మీద లిప్ టు లిస్ కిస్ సీన్‌ను చిత్రీకరించారు. ఇప్పటి వరకూ బాలీవుడ్‌లో ఇదే అతి పెద్ద కిస్ అని పరిశ్రమలోని వారంటున్నారు. ఈ సీనులో సైఫ్‌అలీఖాన్, కరీనాకపూర్‌లు నటించకుండా జీవించారని వారు చెబుతున్నారు. ఈ కిస్ సీన్‌ను హీరోహీరోయిన్లతో పాటు ప్రేక్షకులు కూడా బాగా ఎంజాయ్ చేస్తారని దర్శక నిర్మాతలు భావిస్తుండగా, ఇది సెన్సార్ వారికి నచ్చుతుందో లేదో అన్న అనుమానాన్ని పలువురు వ్యక్తం చేస్తున్నారు. ఈ కిస్ సీన్‌తో పాటు సైఫ్, కరీనాలు నటించిన మరికొన్ని హాట్ హాట్ సీన్‌లు కూడా ఈ చిత్రానికి ప్రత్యేక ఆకర్షణ.